కథ

# అర్హత

**"నమస్తే! నన్ను కైలాసనాధరావుగారు పంపించారు" లోపలికి అడుగుపెట్టిన నన్ను ఆయన ఎగాదిగా చూశారు.**

**మెడలో స్టెతస్కోపు, ఇన్‌షర్ట్‌తో ఉన్న ఆయన నన్ను "ఓ మీరేనా! మిష్టర్ అర్జున్ అంటే?" అన్నారు చేతిలోని పేపరు మడిచి ప్రక్కన పడేస్తూ.**

"యస్ సర్!"

"ప్లీజ్ సిడౌన్!" అని నాకు కుర్చీ చూపించి "అయమ్మా" అని పిలిచారు.

అయమ్మ వచ్చి "బాబుగారూ!" అంది ప్రశ్నార్థకంగా.

"నెయ్యి బాగా వేసిన కారప్పొడి, యిడ్లీ, కాఫీ, తొందరగా రావాలి" అన్నారు హుంకరించినట్టుగా. నా వైపు తిరిగి-

"మీరు ప్రస్తుతం 'ఆనందభారతి' విద్యాలయంలో పని చేస్తున్నారు. మీరు ఎంతో బాగా చదువు చెబుతారు. మీరంటే పిల్లలు విపరీతంగా అభిమానిస్తారు. మీ నాన్న గారు శరత్‌చంద్రగారు బాంకులో ఆఫీసరుగా చేస్తున్నారు. మీరు మాకు దూరపు బంధువు కూడా మీకు తెలియదు లెండి"

నా జాతకం చదువుతున్నట్టున్న ఆయన మాటలు పూర్తవుతూనే అయమ్మ ట్రేలో యిడ్లీ, కారప్పొడి, నెయ్యి వేసిన పళ్ళెం, వేడి వేడి కాఫీ తెచ్చి టీపాయ్ మీద పెట్టింది.

ఆయన పళ్ళెం నా చేతికి అందిస్తూ "తీసుకోండి" అన్నారు.

"మరి మీరు సార్?" అన్నాను.

ఆయన నిర్లక్ష్యంగా నావైపు చూసిన చూపు జన్మలో మరిచిపోలేను.

"మా యింటికి వచ్చి మాకు మర్యాదలు నేర్పనక్ఖరలేదు. మీరు తీసుకోండి" అన్నారు కఠినమైన కంఠ స్వరంతో.

రుచికరంగా ఉండటంతో పూర్తిగా తినేశాను. పళ్ళెం క్రిందపెట్టి మంచినీళ్ళు తాగడం పూర్తి చేసిన వెంటనే ఆయనే కాఫీ కప్పు మీద పళ్ళెం తీసి కాఫీ నాకు అందించారు.



"నిన్న క్లాసులో మీరు మా అబ్బాయిని పెన్నుతో పొడవడానికి ప్రయత్నించారట. వాడు చాలా భయపడిపోయి కాన్వెంట్ మానేస్తానంటున్నాడు. మీ ట్రీట్‌మెంట్ పిల్లల పట్ల చాలా ఆటవికంగా ఉందని తెలియచేయడానికి మిమ్మల్ని పిలిపించాను."

నాకు అర్థమైంది. జగన్ నేను పనిచేస్తున్న కాన్వెంట్లో సెవెన్త్ చదువుతున్నాడు. "అది కాదు సార్! అసలు జరిగిందేమిటంటే.."

"చూడండి మాష్టారు. నేను కైలాసనాధరావు బెస్ట్‌ఫ్రెండ్సము. నేను మిమ్మల్ని ఈ క్షణంలోనే ఉద్యోగం తీయించేగలను. పిల్లవాడు యింటికి వచ్చి ఒకటే ఏడుపు. అది చూడలేని నా భార్య ఎక్కడో మీటింగు మధ్యలో అధ్యక్ష ఉపన్యాసం యిస్తున్న నాకు ఫోను. నేను కైలాసనాధరావుకు ఫోను. చివరకు మీరు అని తేలింది. అయితే మీరు కష్టపడి పనిచేసే వ్యక్తి అని తరువాత తెలసింది. మీరు ఎంత బాగా పాఠాలు చెప్పినా మా పిల్లల్ని చంపుకోడానికి మీ స్కూళ్ళకు పంపుకోము కదా! ఆటవిక విధానంలో పిల్లల్ని కొట్టడం మానేసి మంచితనంతో వారిని తీర్చిదిద్దండి" అన్నాడాయన తీవ్రంగా.

"అది కాదు సార్! మీ బాబుని ఓసారి పిలవండి!" అన్నాను బెరుకుగా.

ఆయన లేచి నిలబడ్డారు ఠక్కున.

నేనూ లేచి నిలబడ్డాను.

"ఎందుకు? వాడు మీ ముందుకు వస్తాడు. రేపు మీరు స్కూల్లో వాడినేం చేస్తారోనని మీరేం చేయలేదు అని చెబుతాడు. మిమ్మల్ని పిలిపించిన నేను వెధవవుతాను. అంతేగా! నేను చిల్డ్రన్ స్పెషలిస్టుని. నాకు మనస్తత్వశాస్త్రం అందునా పిల్లల సైకాలజీ బాగా తెలుసు. నా ఉద్దేశ్యం పిల్లల పట్ల మీ ప్రవర్తన మార్చుకోమని చెప్పడమే. ఈసారి ఇలా వచ్చే అవకాశం మీరు తెచ్చుకున్నా నేను యివ్వను. ఇక మీరు వెళ్ళొచ్చు" చెప్పారాయన.

"థాంక్యూ ఫర్ యువర్ సజెషన్" అనేసి బయటకు వచ్చేశాను నేను.

నిజానికి అందులో నా తప్పు లేశమంతయినా లేదు. తప్పంతా ఆ జగన్‌దే!

అసలేం జరిగిందంటే...

ఊరిలో ప్రముఖ పారిశ్రామిక వేత్తల పిల్లలు, వ్యాపారస్తుల పిల్లలు అందరూ చదివే మా 'ఆనందభారతి'లో సీటు దొరికిందన్నా, జాబ్ దొరికిందన్నా ప్రెస్టేజియస్‌గా భావిస్తారు. నేను కైలాసనాధరావు అంకుల్‌గారి రికమెండేషన్‌తో ప్రస్తుతం ఆనందభారతిలో మేథ్స్ టీచ్ చేస్తున్నాను.

ఆరోజు- నేను సెవెన్త్‌లోకి అడుగుపెడుతూండగా చూశాను. అప్పటికే గందరగోళంగా ఉన్న క్లాసులో జగన్ ఒక పిల్లవాడి నోరు బలవంతంగా నొక్కి పెన్నుతో బలంగా నోట్లో పొడిచాడు. వాడు వెనక్కు జరగడంతో పెన్ను ముల్లు నాలిక మీద గుచ్చుకు రక్తం వచ్చింది. నేను అతన్ని వారించి రక్తం వస్తున్న పిల్లవాడిచేత నీరు పుక్కిలింపచేసి ఫస్ట్ ఎయిడ్ చేశాను. అయాకిచ్చి అతనిని యింటికి పంపేశాను. ఆ తరువాత క్లాసులోకి వచ్చాను.

జగన్ ఎప్పుడూ ఎవరితోనో ఒకరితో గొడవ పెట్టుకునే మనస్తత్వం. వారానికి రెండు మూడు కంప్లయింట్స్ టీచర్ మీద పెడతాడు. అతని మనస్తత్వం మొదటి నుంచీ తెలిసిన నేను చాలా బాలెన్స్‌డ్‌గా ట్రీట్ చేస్తూ వచ్చాను. నిన్న మాత్రం నాకు చాలా కోపం వచ్చింది. ఎందుకంటే దెబ్బ తిన్న ఆ రెండో కుర్రవాడు టాప్ ఇంటెలిజంట్. అంత నెమ్మదస్తుడు కూడా. అతన్ని యింటికి పంపేశాక నేను క్లాసు రూమ్‌లోకి వచ్చి జగన్ చేతిలో పెన్ను తీసుకుని అతని నోరు నొక్కి పెన్ను అతని నోట్లో పొడవబోతున్నట్టుగా చూపిస్తూ అన్నాను. "ఇలా నిన్ను పొడిస్తే ఎలా ఉంటుంది? ఆ అబ్బాయి నాలికలో పెన్నుముల్లు దిగి బోలెడంత రక్తం వచ్చింది. ఎదుటివారి బాధ మనకు కలిగితేగానీ ఆ విలువ తెలియదు. మరెప్పుడూ అలా చెయ్యకు" అన్నాను.

అంతే జరిగింది. కానీ అంతా నాదే తప్పు అయినట్టు ఆ పిల్లల మనస్తత్వశాస్త్రం తెలిసిన డాక్టరుగారు నిందించిన తీరు నా మనసును తీవ్రంగా గాయపరచింది. నాన్నగారితో జాబ్ మానేస్తాను అన్నాను.

"ఈరోజుల్లో జాబ్ మానేయడం చాలా తేలిక. సంపాదించుకోవడం ఎంతో కష్టం. ఇలాంటివి ఎన్నో వస్తుంటాయి.

**కొత్తపల్లి ఉదయ బాబు**

ఇది మొదటిసారి కదా! కాస్త బాధగా ఉంటుంది. మరీ అంత సెన్సిటివ్ అయితే ఎలా? పిల్లలకు నువ్వు నిష్కల్మషంగా చేసే సేవ ఎప్పుడూ నిన్ను చల్లగా కాపాడుతుంది. నా మాట విని జాబ్ మానకు" అన్నారు నాన్నగారు.

ఆరోజు మామూలుగానే కాన్వెంట్‌కు వెళ్ళాను. జగన్ రాలేదు. ఆ తర్వాత తెలిసింది. జగన్‌ను హైదరాబాద్‌లో జాయిన్ చేశారని. అలా నా టీచింగ్ సర్వీస్‌లో మొదటి గాయం చంద్రునిలో మచ్చలా నేను మరింత జాగ్రత్తగా పనిచేసేలా నాకు తీయని బాధాకర జ్ఞాపకంగా నిలిచిపోయింది.

సుమారు పద్దెనిమిది సంవత్సరాల తర్వాత ఈవేళ నేను సెంట్రల్ స్కూల్‌లో పి.జి.టిగా వర్క్ చేస్తున్నాను. నాన్నగారు రిటైర్ అయి నా దగ్గరే ఉంటున్నారు. హైదరాబాద్‌లో నాకంటూ ఏర్పాటు చేసుకున్న చక్కని యిల్లు. భార్యాపిల్లలతో నా జీవితం చాలా సంతృప్తిగా సాగుతుందనే చెప్పాలి.

ఆరోజు సెకండ్ సాటర్ డే కావడంతో అమ్మ, నాన్నగారు, నేను, నా భార్య పిల్లలతో సహా చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం, గణపతి దేవాలయాలకు వెళ్ళాం. అర్చన చేయించి విశాలమైన మంటపంలో కూర్చున్నాం.

అంతలో నాన్నగారు ఎవరినో గమనించి అటు వెళ్ళారు.

నేను పిల్లలతో కబుర్లు చెబుతూనే నాన్నగార్ని గమనిస్తున్నాను.

ఎవరో పెద్దాయన నాన్నగారి తమ్ముడి వయసు ఉంటుంది. దీనంగా తన గాథను వినిపించారు. ఆ బాధను తట్టుకోలేకనేమో ఆయన చివరలో నాన్నగారిని పట్టుకుని చిన్నపిల్లాడిలా విలపించారు.

నాన్నగారు ఆయనను ఓదారుస్తూనే నన్ను పిలిచారు. ఒక్కసారిగా లేచి అటు వెళ్ళాను.

"నాన్నా! వెళ్ళి వేడిగా యిడ్లీ పాక్ చేయించి పట్రా!" అన్నారు.

మరో అయిదు నిముషాలలో పాకెట్ నాన్నగారి చేతుల్లో ఉంచాను. మా అబ్బాయి తన వాటర్ బాటిల్ యిచ్చాడు.

నాన్నగారు ఆయన చేత బలవంతంగా యిడ్లీ తినిపించారు. ముందు మొహమాటపడ్డా తరువాత ఆబగా తిన్న విధానం చూస్తే ఆయన తీవ్రమైన ఆకలితో ఉన్నారని అర్థమైంది నాకు.

"ఎవరో గుర్తుపట్టావా?" అడిగారు నాన్న.

నేను పోల్చుకోలేక "తెలీదండీ" అన్నాను.

"నువ్వు ఆనందభారతిలో పనిచేసినప్పుడు వాళ్ళ బాబుని కొట్టావని కైలాసనాధరావు అంకుల్ ఓ డాక్టరుగారింటికి పంపారు చూడు. ఆయన!"

నేను అవాక్కయ్యాను.

"నమస్తే సార్!" అన్నాను. ఆయన తలెత్తి నాకేసి సూటిగా చూడలేక ఓడిపోయిన వాడిలా తలపంకించి తినడంలో మునిగిపోయారు.

ఆరోజు కడుపునిండా తిండి పెట్టి అవమానించిన ఆయనకూ ఈయనకూ ఎక్కడా పోలికలు లేవు.

ఆ హుందాతనం, ఆదర్పం, ఆ నిర్లక్ష్యమైన చూపు, మాట తీరూ ఏవీ కనిపించడం లేదు. ఆయనలో అంత మార్పును నేను వూహించలేకపోతున్నాను.

"చూడండి. మీ కోర్టు పనులు అయిపోయాక రేపు మా యింటికి రండి. మా అబ్బాయికి సెలవు. మీకు కూడా కోర్టు సెలవు కదా. మా యింట్లో భోజనం చేశాక కైలాసనాధరావు యిక్కడే కొడుకు దగ్గర ఉన్నాడంటున్నారు కదా! నేను కూడా వస్తాను. వాడిని చూసి చాలా కాలం అయింది" అన్నారు నాన్నగారు ఆయనతో.

★ ★ ★

ఆ మర్నాడు నాన్నగారి సలహా మీద నేనే డాక్టరు దగ్గరకు వెళ్దామనుకున్నంతలో ఆయనే వచ్చేశారు.

నాన్నగారి వెనుకగా నిలబడిన నేను "రండి సార్!" అంటూ ఆహ్వానించాను.

నాన్నగారు 'బొమ్మరిల్లు'లా ఉండే నా యింటినంతటినీ ఆయనకు చూపించారు. భోజనాలు పూర్తయ్యాక హాల్లోకి చేరారు. పిల్లలు, నా భార్య నా గదిలో టీవీ చూడటంలో మునిగిపోయారు. నేను నాన్నగారి గదిలోకి వచ్చి మంచం మీద నడుం వాల్చాను.

నాన్నగారు, అమ్మ ఆయనతో హాల్లో మాట్లాడుతున్నవన్నీ నాకు స్పష్టంగా వినబడుతున్నాయి. ఆ మాటల వల్ల నాకు అర్థమైన సారాంశం యిదీ!

జగన్‌ను హైదరాబాదులో చేర్చాక టెన్త్‌వరకూ బాగానే చదివాడట. ఇంటర్‌లో రెసిడెన్షియల్‌లో చేరడానికిష్టపడలేదట. బయట రూమ్‌లో ఉండి కాలేజీకి వెళ్ళేవాడట. డిగ్రీ పూర్తయ్యేలోపల డబ్బు మంచినీళ్ళలా ఖర్చు చేస్తూ ఎన్ని దుర్వ్యసనాలు అలవరచుకోవాలో అన్నీ నేర్చుకున్నాడట. ప్రతీ చిన్న విషయంలోనూ అవతలి వారిని క్రూరంగా హింసించి ఆనందం పొందేవాడుట. ఇంతలో డాక్టరుగారికి అనుకోకుండా యాక్సిడెంట్ కావడం ఆ యాక్సిడెంట్‌లో భార్యను కోల్పోవడం జరిగింది. చదువు మానేసి వచ్చి వున్న పదెకరాలూ వ్యవసాయం చేసుకోరా అంటే వినకుండా పి.జి. కూడా యూనివర్సిటీలో వెలగబెట్టాడుట. లెక్చరర్లను సెమిష్టర్స్‌లో మార్కులు వేయనందుకు నానా దుర్భాషలూ ఆడేవాడట- ఒక లెక్చరర్‌నైతే చాచి లెంపకాయ కూడా కొట్టబోతే స్టాఫ్ అంతా కలగచేసుకుని అతన్ని కాలేజీ నుంచి సస్పెండ్ చేసేంతవరకూ నిరాహార దీక్ష చేశారట. అతని తప్పు తెలిసిన అతని ఫ్రెండ్స్ ఎవ్వరూ మద్దతు ఇవ్వకపోవడంతో చదువుమధ్యలో ఆపి తండ్రి దగ్గరకు వచ్చేశాడట. పొలం చూసుకోరా అంటే పంటంతా అమ్మేసి ఆ డబ్బుతో ఒకమ్మాయిని మెయింటెయిన్ చేస్తున్నాడట. ఆ మొత్తం ఆస్థిని తనకిచ్చేయమని ఓరోజు గొడవ పెట్టాడట. అందుకు నిరాకరించిన డాక్టరుగారిని నిర్దాక్షిణ్యంగా కొట్టి యింట్లోంచి తరిమేసి పైగా తండ్రి తనను హత్య చేయబోయాడని కోర్టులో కేసు వేశాడుట. కైలాసనాధరావు గారి సాయంతో అతన్ని అరెస్టు చేయించారట డాక్టరుగారు. 'తండ్రిమీద నీకు కక్షేమిటి నాయనా' అని కైలాసనాధరావుగారు చెప్పబోతే 'కొడుకును అరెస్టు చేయించిన వాడు నాకు తండ్రేమిటి! బయటకు వచ్చాక చెబుతాను' అని బెదిరించాడట. అతనిమీద డాక్టరుగారే కైలాసనాధరావుగారి సాయంతో హైదరాబాద్‌లో కేసు వేయించారట. కొడుకే తన పాలిట శత్రువు అయినందుకు బాధపడాలో రక్తబంధం తెంచుకోవాలో తెలియని మానసిక వేదనతో ఒంటరితనంతో జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను- అంటూ ఆయన గాద్గదికంగా చెబుతుంటే వింటున్న నా కళ్ళు అప్రయత్నంగా చమర్చాయి.

చివరగా అంటున్నారాయన.

"ఆనాడు మీ అబ్బాయిని పిలిపించి కడుపునిండా తిండి పెట్టి మరీ తిట్టాను. ప్రతీక్షణం నా టెంపర్‌మెంట్ కాపాడుకోవాలనే అజ్ఞానంలో బ్రతికిన రోజులు. ఆనాడు నేను నా బిడ్డను మందలించి అవసరమైతే శిక్షించి అదే కాన్వెంట్‌లో మీ అబ్బాయి శిక్షణలోనే ఉంచినట్లయితే నా బ్రతుకు ఖచ్చితంగా యిలా ఉండేది కాదు శరత్‌చంద్ర! అతని మంచితనం అతన్ని యింత ఉన్నత స్థితిలోకి తీసుకు వచ్చింది. నా అహంకారం నా పాలిట స్వయంకృతాపరాధమై నన్ను దహిస్తోంది. అతని ముఖం చూసే అర్హత కూడా నాకు లేదు. మీ బాబుని నన్ను మనస్ఫూర్తిగా క్షమించమని నా మాటగా చెప్పు ప్లీజ్" అంటూ వెక్కి వెక్కి ఏడవసాగారాయన.

ఇక నేను ఆగలేకపోయాను.

ఒక్కసారిగా లేచి హాల్లో వున్న ఆయన దగ్గరకు వచ్చాను.

"అంకుల్! నిజంగా మీరు ఏ తప్పూ చేయలేదు. మీరు నన్ను మందలించినా అది నా మంచికే అనుకున్నానుగానీ మీ పాదాల సాక్షిగా నాకు మీమీద కోపం లేదు. ఈ వయసులో మీరిలా కష్టపడడం, ఏనాడో జరిగిన ఒక చిన్న విషయాన్ని పదే పదే తలచుకుని మీలో మీరు కృంగిపోవడం మీ ఆరోగ్యానికి అంతమంచిది కాదు. జగన్ ఎప్పటికైనా మారతాడు. మీ వెనుక నాన్నగారు, కైలాసనాధరావు అంకుల్, నేను ఎంతో మంది ఉన్నాం. మీకు అభ్యంతరం లేదనుకుంటే మా యింట్లో ఉండొచ్చు. మీరిలా మరెప్పుడూ బాధపడనని నాకు మాట యివ్వండి" అన్నాను.

అవ్యక్త ఆనందం పొందుతున్న ముఖకవళికలతో ఆయన నా రెండు భుజాలు పట్టుకుని ఆలింగనం చేసుకున్నారు.

✤

